జడ్‌పి సిఇఒ భాస్కర్‌రెడ్డి సస్పెన్షన్

మరికొందరిపైనా చర్యలకు రంగం సిద్ధం ?
వెంటాడుతున్న ఓటర్ల తొలగింపు తప్పిదాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లా పరిషత్ సిఇఒ కె.భాస్కర్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఉరవకొండ నియోజకవర్గం పరిధిలో ఓట్ల తొలగింపులో నిబంధనలు పాటించని కారణంగా ఆయనపై వేటు పడింది. ఈ మేరకు చీఫ్ ప్రిన్సిపాల్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఈనెల 19న ఉత్తర్వులు జారీ చేశారు. ఉరవకొండ నియోజకవర్గం పరిధిలో 2020, 2021 సంవత్సరంలో జరిగిన ఓటర్ల జాబితా తయారీలో 1116 ఓట్లను తొలగించారు. ఆ సమయంలో కె.భాస్కర్‌రెడ్డి అక్కడ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పనిచేశారు. ఈ విషయంపైనే ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఉరవకొండ నియోజకవర్గంలో పర్యటించి ఓటర్ల జాబితాను పరిశీలించిన విషయం తెలిసిందే. దీనిపై తదుపరి విచారణ సైతం చేపట్టింది. ఈ విచారణలో బాధ్యులుగానున్న వారిపై చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. ఇది వరకే ఇద్దరు బిఎల్‌ఒలపై వేటు పడింది. మరికొంత మందిపైనా వేటు పడే అవకాశాలున్నట్టు సమాచారం.

జడ్‌పి సిఇఒ భాస్కర్‌రెడ్డి

వెంటాడుతున్న తప్పిదాలు

ఓటర్ల జాబితాలో జరిగిన తప్పిదాలు వరుసగా ఉద్యోగులను వెంటాడుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో ఇద్దరు బిఎల్‌ఒ (బూత్ లెవల్ అధికారులు) సస్పెన్షన్‌కు గురయ్యారు. చిలకురికి గ్రామంలో మూడు వేల ఓట్లు తొలగించారని ఆరోపిస్తూ ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అప్పటి జిల్లా కలెక్టరు ఇద్దరు బిఎల్‌ఒలపై సస్పెన్షన్ వేటు వేశారు. దాని తరువాత కేంద్ర ఎన్నికల సంఘం ఉరవకొండలో పర్యటించి ఆర్డీవోతోపాటు, తహశీల్దారు సమక్షంలో విచారణ జరిపింది. ఈ విచారణ అనంతరం మరికొంత మందిపై చర్యలకు ఉపక్రమించింది. అందులో భాగంగా జెడ్‌పి ఇసిఒ భాస్కర్‌రెడ్డిపై వేటు పడింది. ఆయన కంటే ముందున్న జెడ్‌పి సిఇఒ శోభా స్వరూప రాణిపైనా వేటు పడే అవకాశాలున్నట్టు అధికారవర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈమెతోపాటు మరో ఇద్దరు ఇఒఆర్‌డిలపైనా చర్యలుండే అవకాశాలున్నట్టు సమాచారం.

ఓటర్ల సర్వేపైనా ఇద్దరిపై వేటు

ఓటర్ల సర్వేలోనూ ఇద్దరిపై వేటు పడింది. వజ్రకరూరు మండలంలో ఓటర్ల సర్వే ప్రారంభించకపోవడంపై జిల్లా కలెక్టరు గౌతమి సీరియస్ అయ్యారు. ఈసందర్భంగా ఇద్దరిని సస్పెన్షన్ చేశారు. ఇలా ఎన్నికల్లో తప్పిదాలపై ఒకరి తరువాత ఒకరిపై వేటు పడుతుండటంతో ఎన్నికల విధులంటేనే సిబ్బందిలో గుబులు రేగుతోంది. ఏ చిన్న తప్పు జరిగినా ఇబ్బందులు తప్పవన్న భయం నెలకొంటోంది.

ఇందిరమ్మ కాలనీలో కనీస సౌకర్యాలు కరువు

విద్యుత్ స్తంభాలు లేకా కర్రల సహాయంతో ఇంటికి కరెంటు తీసుకున్న దృశ్యం

రోడ్లు , డ్రయినేజీల ఏర్పాటుపై నిర్లక్ష్యం
కర్రలసాయంతో విద్యుత్ లైను
ఇబ్బందుల్లో కాలనీవాసులు
పట్టించుకోని పాలకులు, అధికారులు

పేదలకు గూడు కల్పిస్తామని వారి నివాసా కాలనీల్లో వెలుగుల నింపుతామని సకల సదుపాయాలు కల్పిస్తామని పాలకులు ఇచ్చే హామీలు నీటి మీద రాతలుగా మిగులుతున్నాయి. పాలకులు ఎవరైనా ప్రభుత్వాలు ఎన్ని మారినా పేదలకు కన్నీళ్లే మిగులుతున్నాయి. 16 సంవత్సరాలుగా ఓ కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారు. రహదారులు, విద్యుత్ సదుపాయం, మురుగు కాలువలు లాంటి కనీస సదుపాయాలను సైతం కల్పించలేక పోయారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తమకు సదుపాయాలు కల్పించాలంటూ పేద జనం ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టు ఏళ్ల తరబడి తిరుగుతున్నా కనికరించే వారు కనిపిండం లేదు. దీంతో కనీస సదుపాయాలు లేని కాలనీ ప్రజలు బిక్కుబిక్కు మంటూ కాలం గడపాల్సిన దుస్థితి దాపురించింది.

కనీస సౌకర్యాలకు నోచుకోని పూలకుంట ఇందిరమ్మ కాలనీ

ప్రజాశక్తి-హిందూపురం

వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో హిందూపురం పట్టణానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉండే రూరల్ మండలం పూలకుంట పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ కాలనీనిఏర్పాటు చేశారు. దాదాపు 100 మందికి పైగా ఇంటి పట్టాలను ఆ సమయంలో ప్రభుత్వం మంజూరు చేసింది. కాలనీలో సౌకర్యాలు కల్పించక పోయినప్పటికీ ఏదో ఒక రోజు కల్పిస్తారన్న నమ్మకంతో దాదాపు 50 మంది గృహాలను నిర్మాణం చేసుకుని చేసుకుని జీవనం చేస్తున్నారు. ఇప్పటికి 16 సంవత్సరాలు గడిచినా ఇందిరమ్మ కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదు. విధి లేని పరిస్థితుల్లో ఎలాంటి వసతులు లేకపోయినప్పటికి అక్కడే నివాసం వుంటున్నారు. రోడ్లు లేవు, కాలువలు లేవు, కనీసం విద్యుత్ సౌకర్యం సైతం లేకపోయినప్పటికి నివాసం ఎలా వుండాలి అంటూ ఆ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలంలో అయితే ఈ ప్రాంతంలో పరిస్థితి మరింత దారుణంగా వుంటుంది. రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో వర్షపు నీరంతా రోడ్లపై నిలుస్తుంది. ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో దోమలు విపరీతంగా పెరిగి ఈ ప్రాంత ప్రజలు అంటు వ్యాధుల బారిన పడుతున్నారు. ఇది చాలదన్నట్లు విష కీటకాల కాటుకు బలి అవుతున్నారు. కాలనీలో విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో రోడ్డులో ఉన్నా విద్యుత్ స్తంబాల నుంచి కర్రలను ఏర్పాటు చేసుకుని ఇండ్లకు విద్యుత్ కనెక్షన్ తీసుకున్నారు. వీధి దీపాలు లేక పోవడంతో విష కీటకాలు ఎప్పుడు ఎవరిని కరుస్తాయోనన్న భయందోళనతో ఆ ప్రాంత ప్రజలు జీవనం చేయాల్సిన దుస్థితి దాపురించింది.

రోడ్లు, మురుగు కాలువలు లేని దృశ్యం

సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదు

గ్రామ సర్పంచుగా ఎంపిక అయినప్పటి నుంచి ఇందిరమ్మ కాలనీలో ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలను కల్పించాలని ప్రతి మండల సమావేశంలోను అధికారులకు, పాలకులకు వివరిస్తున్నా. అయితే ఏ ఒక్కరు పట్టించు కోవడం లేదు. ఇప్పటి వరకు ఆరు సమావేశాలు జరిగాయి. మొదటి సమావేశం నుంచి సమస్యను సభ దృష్టికి తీసుకువస్తున్నా ఇప్పటికి పరిష్కరించలేదు. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులు, ఇతర నిధులు అయిన పంచాయితీలకు వస్తే వాటి ద్వారా సౌకర్యాలు కల్పించడానికి సాధ్యం అవుతుంది. ఆ నిధులు సైతం రాలేదు. పంచాయతీ సాధారణ నిధుల్లో నుంచి సుమారు రూ.2.50లక్షలు వెచ్చించి నీటి సౌకర్యాన్ని కల్పించా. జగనన్న లే అవుట్‌లో నివాసాలు లేక పోయినప్పటికి ప్రతి 10 అడుగులకు ఒక విద్యుత్‌స్తంభం ఏర్పాటు చేశారు. అయితే నివాసాలు ఉన్న ఇందిరమ్మ కాలనీలో ఇప్పటికి కరెంటు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మంజునాథ్.
గ్రామ సర్పంచు

సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నాం

ఇందిరమ్మ కాలనీలో కనీస సౌకర్యాలు లేక పోయినప్పటికి, అద్దెలు చెల్లించే స్థోమత లేక ఇక్కడే నివాసం ఉంటున్నాం. విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో ప్రధాన రహదారి నుంచి తమ నివాసానికి దాదాపు రూ.6వేలు ఖర్చు చేసి కర్రల సహాయంతో వైరు వేసుకుని కరెంటు తీసుకున్నాము.

అంజినమ్మ,
కాలనీవాసి

నివాసం ఉండలేక పోతున్నాం

కాలనీలో రోడ్డు, మురుగు కాలువలతో పాటు కనీస సౌకర్యం లేక పోవడంతో నివాసం ఉండలేక పోతున్నాం. అయితే ఒక్కరి సంపాదనపై అందరు జీవనం చేయాలి. అద్దెలు చూస్తే విపరీతంగా ఉన్నాయి. దీంతో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో అప్పులు చేసి నివాసం ఏర్పాటు చేసుకున్నాము.

రేష్మా,
కాలనీవాసి

సౌకర్యాల కల్పనకు తగిన చర్యలు

పూలకుంట గ్రామ పంచాయతీ పరధిలోని ఇందిరమ్మ కాలనీలో ప్రజలకు అవసరమైన సౌకర్యాలను కల్పించడానికి తగిన చర్యలు తీసుకుంటాం. సమస్యను గ్రామ సర్పంచి తమ దృష్టికి తీసుకువచ్చారు. న్ని శాఖ అధికారులతో చర్చించి సౌకర్యాలు కల్పిస్తాం.

నరేంద్ర కుమార్,
ఎంపిడిఒ

జిల్లాలో 227.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీనిపై ఆదివారం గణాంకాల అధికారి గంగాద్రి మాట్లాడుతూ జిల్లాలో కొన్ని మండలాల్లో కురిసిన వర్షానికి 227.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. జిల్లాలోని 32 మండలాలకు గాను 10 మండలాలు మినహా మిగతా 22 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా సోమందేపల్లిలో 33.8 మి.మీ, పుట్టపర్తిలో 33.2 మి.మీ వర్షం, అత్యల్పంగా తనకల్లులో 1.6 మి.మీ వర్షం కురిసింది. ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతుండడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతున్న తరుణంలో ఈ వర్షంతో కాస్త ఉపశమనం కలిగినట్లు అయింది. ఖరీఫ్ పంటకు అదును దాటిన తర్వాత కురిసిన వర్షానికి ప్రత్యామ్నాయ పంటలు కంది, ఉలవ, పెసర, ఆముదం, తదితర పంటలు సాగు చేసేందుకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు పేర్కొన్నారు.

బాలయ్య పర్యటనలో మార్పు

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నియోజకవర్గ పర్యటనలో మార్పులు జరిగినట్లు సమన్వయకర్త శ్రీనివాస్‌రావు ఆదివారం తెలిపారు. 21 నుంచి బాలయ్య పర్యటన ఉండేదని అయితే ఈ నెల 23, 24 తేదీల్లో పర్యటిస్తారన్నారు. రెండు రోజుల పాటు చిలమత్తూరు మండల టిడిపి నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారన్నారు. 25న పట్టణంలోని నూతన మార్కెట్ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణ పనులకు భూమి పూజ చేసి ప్రారంభిస్తారన్నారు. అదే రోజు సాయంత్రం రహమత్‌పురం కెజిబివిలో ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటర్‌ను ప్రారంభించి, 5 కంప్యూటర్లు పంపిణీ చేస్తారన్నారు. అనంతరం నాయకులతో సమావేశం నిర్వహించి పార్టీ అభివృద్ధిపై చర్చిస్తారన్నారు.

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను కొనసాగించాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి ఇఎస్. వెంకటేష్

సమావేశంలో మాట్లాడుతున్న ఇఎస్ వెంకటేష్

ప్రజాశక్తి కదిరి అర్బన్

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను యథావిధిగా కొనసాగించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జె.రామక్రిష్ణ అధ్యక్షతన ఆదివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తల సాంబశివ, జిల్లా అధ్యక్షులు సురేంద్ర చౌదరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అహమ్మద్ హుస్సేన్, బిఎస్‌పి నాయకులు బెనర్జీ, ఇర్ఫాన్, సిపిఎం నాయకులు జి. నరసింహులు, పట్టణ కార్పెంటర్ యూనియన్ నాయకులు హిదయాతుల్లా, పట్టణ బిల్డింగ్ సంఘం నాయకులు షామీర్, వలీ తనకల్లు నాయకులు శ్రీనివాస్, తలుపుల నాయకులు మహబూబ్‌బాషా, గణేష్, బాబ్జన్, నల్లచెరువు కిష్టప్ప, సదాశివ, గాండ్లపెంట సోము, పూలకుంట వెంకటేష్, నల్లమాడ నరసింహులు,గంగరాజు, మున్సిపల్ నాయకులు జనార్ధన్, నాయకులు బాబ్జన్, వ్యవసాయ కార్మిక సంఘం రమేష్ సీనియర్ నాయకులు జాఫర్ వలీ ,స్థానిక సిఐటియు నాయకులు జగన్, ముస్తక్ ,ఫైరోజ్, పాజిల్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను ఆపేస్తూ జారీ చేసిన మెమో నెంబర్ 1214 ను రద్దుచేసి సంక్షేమ పథకాలను గతంలో ఉన్న వాటిని యథాతథంగా కొనసాగించాలన్నారు. జీవో నెంబర్ 17ని రద్దు చేసి నిబందనలకు విరుద్ధంగా తరలించిన సంక్షేమబోర్డు నిధులను తిరిగి జమ చేయించాలని డిమాండ్ చేశారు. పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును ప్రారంభించి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని, వేలాది మందికి బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా లబ్ధి చేకూరిందని అన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వ హయాంలో బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు జరగవని కార్మికశాఖ కమిషనర్ మెమో నెం.1214 ను జారీ చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. చట్ట ప్రకారం అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ పథకాన్ని అమలు చేయించాలని, 60 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులను కూడా వెల్ఫేర్ బోర్డులో సభ్యులుగా కొనసాగిస్తూ సంక్షేమ పథకాలు అమలు జరిపించాలని డిమాండ్ చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు నిధులను చంద్రన్న బీమాకు వాడిన సందర్భంగా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్లు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాయని గుర్తు చేశారు. ఆ సందర్భంగా ఆనాటి ప్రతిపక్షంలో ఉన్న వైసిపి అప్పటి ప్రభుత్వ చర్యలను తప్పుపట్టి భవన నిర్మాణ కార్మికుల ఆందోళనలో పాల్గొని మద్దతునిచ్చిందని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వం వైఎస్ఆర్ బీమాకు ఏకంగా రూ.385 కోట్లు, మిగులు నిధులు అనే పేరుతో రూ. 450 కోట్లు బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు నుండి దారి మళ్లించిందని విమర్శించారు. ఈ సమస్యలపై ఈనెల 27న స్థానిక ఎమ్మెల్యే కి కలిసొచ్చే సంఘాలను, రాజకీయ పార్టీలను కలుపు కొని సామూహికంగా వినతిపత్రం ఇవ్వాలని రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

సత్యసాయి ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

సత్యసాయి వాటర్ ప్రాజెక్టుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసి కార్మికులకు జీతాలు అందించేలా ఎమ్మెల్యేలు కృషి చేయాలని సత్యసాయినీటి సరఫరా విభాగం కార్మికులు విన్నవించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక లక్ష్మీచెన్నకేశవపురం వద్ద ఉన్న సత్యసాయి పంప్ హౌస్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయి నీటి పథకాన్ని నమ్ముకుని జిల్లా జిల్లా వ్యాప్తంగా 600 మంది కార్మికులు ఉన్నారన్నారు. అలాగే సత్యసాయి నీరు 10 నియోజకవర్గాల ప్రజలు వినియోగిస్తున్నారన్నారు. వర్షాభావంతో నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని, కావున ప్రభుత్వం సత్యసాయి ప్రాజెక్టుకు నిధులు విడుదల చేసి, ప్రజలకు సకాలంలో నీరందించేలా ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు రామచంద్ర, రాజేంద్రరెడ్డి, నారాయణ, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

పంప్ హౌస్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

అర్హుల ఓట్లు తొలగిస్తే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తాం : గోనుగుంట్ల

ధర్మవరం టౌన్ : రాజకీయ స్వలాభం కోసం ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఓట్లను తొలగించే కుట్రలో భాగంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వ్యవహారం ఉందని, ఆ కోణంలోనే బోగస్ ఓట్లు ఉన్నాయంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారంటూ మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఆదివారం పట్టనంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికార పార్టీ చెప్పినట్లు ప్రతిపక్ష పార్టీల ఓట్లను తొలగిస్తే ఆర్డీవో, తహశీల్దార్లు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పోతులనాగేపల్లి వద్ద అనర్హులకు పట్టాలిస్తే ఆర్డీవో, తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్ ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ధర్మవరం నియోజకవర్గం లో చాలా తప్పిదాలు జరిగాయని, ఇప్పటికే 4 ఎపిసోడ్లు పెట్టానని, త్వరలో 5వ ఎపిసోడ్ కూడా వదులుతానని అన్నారు. వీటిపై సిట్టింగ్ జడ్జి చేత విచారణ చేయించి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకులా చేస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు సుదర్శన్‌రెడ్డి, డిష్ రాజు, చిగిచెర్ల అరవిందరెడ్డి, దుస్సా క్రిష్ణ, బోడగల గిరిధర్, రాప్తాటి రాము, తుంపర్తి పరమేష్, దేవేంద్రరెడ్డి, నబి రసూల్, అశ్వర్థనాయుడు, చిలకం సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు

సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్‌వి. మాధవరెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో శాంతి భద్రతలకు ఎవరైనా ఎలాంటి విఘాతం కలిగించిన ఉపేక్షించేది లేదని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి భయంలేకుండా జీవించడానికి అనువైన వాతావరణం కల్పించడమే తమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. హత్యలు, నేరాలకు పాల్పడిన ఏ కేటగిరీలో ఉన్న రౌడీషీటర్లను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చామని అలాంటి వారు తిరిగి శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే జిల్లా బహిష్కరణ చేపడతానని హెచ్చరించారు. జిల్లాలో రౌడీ షీటర్ల కదిలకపై నిఘా ఉంచామని హద్దు దాటి అల్లర్లు అలజడలు పాల్పడినా, చెడుతనంతో ఇతరులకు ఇబ్బంది పెట్టిన ఉపేక్షించబోమని తెలిపారు. జిల్లాలోని పోలీసులు ప్రజల సమస్యలు పరిరక్షించే విధంగా గ్రీవెన్స్ ఏర్పాటు చేశామని దానికి అనూహ్య స్పందన లభించిందని చెప్పారు. జిల్లాలో యువత మద్యానికి మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : ఇటీవల జిల్లాలో గంజాయి విక్రయాలు పెరిగిపోతున్న నేపథ్యంలో మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జవాబు: గంజాయి అక్రమ రవాణాపై జిల్లా వ్యాప్తంగా గట్టి నిఘా ఉంచాం. జిల్లాలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా గంజాయి క్రయవిక్రయాలు తగ్గాయి. గంజాయి సేకరించినా లేదా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఎక్కడ క్రయవిక్రయాలు జరగలేదు. ఒరిస్సా రాష్ట్రం నుండి ఆంధ్ర ప్రదేశ్‌కు సరఫరా అవుతుండేది. దానికి అడ్డుకట్ట వేశారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు చేపట్టాం. గడిచిన ఐదు నెలలలో11 గంజాయి కేసులు నమోదు చేసి 54 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 51.62 కేజీల గంజాయిని సీజ్ చేశాం.

ప్ర : జిల్లాలో పెట్రేగిపోతున్న అసాంఘిక శక్తులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యక్రమాలు చేపట్టే వారిపై ఉక్కు పాదం మోపుతున్నాం. మద్యం అక్రమ రవాణా, గుట్కా, మట్కా, నాటుసారా గ్యాంబ్లింగ్, గంజాయి వంటివి అక్రమ రవాణా సాగించే వారిపై చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా వ్యాప్తంగా వివిధ నేరాలలో పట్టుబడిన 4293 వాహనాలను సీజ్ చేశాం. వాటిలో 159 వాహనాలను పబ్లిక్ యాక్షన్‌లో వేలం వేసి వచ్చిన సొమ్మును ప్రభుత్వ ఖాతాలలో జమ చేశాం. 2021 సంవత్సరం 970 నాటుసారా కేసులు నమోదు కాగా 625 మందిని రిమాండ్ పంపాం. 2022లో 714 కేసుల్లో 295 మంది నిందితులపై కేసు నమోదు చేశాం. గడచిన ఐదు నెలలలో మట్కా ఆడే వారిపై 215 కేసులు గాను 376 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 36 85,661 రూపాయల నగదు సీజ్ చేశాం. క్రికెట్ బెట్టింగులపై 27 కేసులు నమోదు చేయగా 118 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 68,83195 రూపాయలు స్వాధీనం చేసుకున్నాం. చేశాం. గ్యాంబ్లింగ్ ఆడే వారిపై 1229 కేసులు నమోదు చేసి వారి వద్ద నుండి7681888 రూపాయలు సీజ్ చేశాం.

ప్ర : జిల్లాలో శాంతిభద్రతలు, రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : సత్యసాయి జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా అసాంఘిక కార్యక్రమాలు చేపట్టే వారిపై ప్రత్యేకంగా నిఘా ఉంచాం. అవసరమైనచోట్ల సిబ్బందిని ఏర్పాటు చేసి, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు చేపడుతున్నాం. గడచిన ఐదు నెలల్లో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై 365 కేసులు నమోదు చేశాం. వారి వాహనాలను సీజ్ చేశాం. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 711 రోడ్డు ప్రమాదాలపై కేసులు నమోదు చేయగా వాటిలో 449 మంది మృతిచెందారు. 838 మందికి గాయాలయ్యాయి.

సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి

4) నాటు సారా, కర్నాటక మద్యంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా నాటుసారా, కర్నాటక మద్యాన్ని అరికట్టడానికి పోలీస్ యంత్రాంగం పటిష్ట భద్రత ఏర్పాటు చేసింది. అంతర్రాష్ట్ర సరిహద్దులలో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి నిఘా ఉంచాం. శ్రీ సత్య సాయి జిల్లా సరిహద్దు ప్రాంతంగా కర్నాటక 250 కిలోమీటర్ల పరిధిలో ఉన్నందున జిల్లాలో మద్యం అక్రమ రవాణా చేయడానికి అనుకూలంగా ఉంది. దీంతో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాలను తనిఖీలు చేసి పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 20 గ్రామాల్లో నాటుసారా తయారు చేసే వారిని గుర్తించాం. వారిపై ప్రత్యేక నిఘా ఉంచి దాడులు నిర్వహిస్తున్నాం. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి నాటుసారా తయారు చేయకుండా దానిని వినియోగించకుండా చర్యలు చేపడుతున్నాం.

సిడబ్ల్యుసి మెంబర్‌గా మాజీ మంత్రి రఘువీరారెడ్డి

మడకశిర : కాంగ్రెస్ పార్టీ సిడబ్ల్యుసి మెంబర్‌గా మాజీ మంత్రి రఘువీరారెడ్డిని నియమించారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఈ విషయాన్ని వెల్లడించారు. ఇటీవల కర్నాటకలో జరిగిన ఎన్నికల్లో రఘువీరా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు తనవంతు కృషి చేశారు. అలాగే రెండు రోజుల క్రితం కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ క్రమంలో ఆదివారం ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ప్రకటించిన జాబితాలో మాజీ మంత్రి రఘువీరారెడ్డికి సిడబ్ల్యుసి మెంబర్‌గా చోటు దక్కడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు 'స్పందన'

పుట్టపర్తి అర్బన్ : జిల్లా, డివిజన్, మండల స్థాయిలో సోమవారం(నేడు) యధావిధిగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆదివారం కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఓ ప్రకటన విడుదల చేశారు. కలెక్టరేట్‌లో ఉదయం 9:30 గంటలకు స్పందన ప్రారంభమవుతుందన్నారు. అర్జీదారులు దరఖాస్తుకు ఆధార్ నెంబర్, ఫోన్ నెంబర్ జత చేయాలన్నారు. డివిజన్, మండల స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని వారు అర్జీలు ఇవ్వాలన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్

కదిరి టౌన్ : ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ జకియా ఖానం, కదిరి వైసిపి మైనార్టీ నాయకులు సాదత్ అలీఖాన్, సమీవుల్లాఖాన్, సమీర్‌ఖాన్, సల్మాన్, షారుక్, సైఫ్ తదితరులు ఆదివారం తిరుపతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మిథున్‌రెడ్డిని పూలమాలలు, దుశ్శాలువాతో సన్మానించి వినాయకుని ప్రతిమను బహూకరించారు. అలాగే కదిరి నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, మైనార్టీల సంక్షేమానికి, అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎంపికి విన్నవించారు. రాబోయే రోజుల్లో కదిరి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని ఎంపీ వారికి సూచించినట్లు మైనార్టీ నాయకులు సాదత్ అలీఖాన్ తెలిపారు.

టిడిపిలో పలువురు చేరిక

కదిరి టౌన్ : పట్టణంలోని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్ నివాసంలో ఆదివారం కందికుంట సమక్షంలో తలుపుల మండలంలోని ఒబులరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సుమారు 50 మంది యువకులు వైసిపి జిల్లా యూత్ ఉపాధ్యక్షులు నాగరాజు ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. వారికి కందికుంట పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, మండల కన్వీనర్ ముబారక్, రాజారెడ్డి, ఒబులరెడ్డిపల్లి చంద్ర, శీన, రాధాకృష్ణ, రామాంజినమ్మ, నారాయణ, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

బాల్యమిత్రునికి ఆర్థిక సాయం

నల్లచెరువు : మండల పరిధిలోని గురిజేవాండ్లపల్లికి చెందిన నాగభూషణ 2003లో అతడితో పాటు 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం రూ. 17వేలు అందజేశారు. నాగభూషణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు పూర్తిగా దెబ్బ తిన్నాయి. ఈ విషయం తెలుసుకున్న బాల్య మిత్రులు తమ వంతుగా ఆదుకున్నారు. కార్యక్రమంలో బావాజీ, అమరేంద్ర, ప్రకాష్‌నాయుడు, అమీర్, రెడ్డప్ప, హరి, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి చేయూత

పెనుకొండ : పేద విద్యార్థి దినేష్‌నాయక్ ఎంబిబిఎస్ చదువుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో రూ. 5 వేలు అందజేశారు. అలాగే ఆర్‌అండ్‌బి శాఖలో పనిచేస్తున్న చిరుద్యోగి రామాంజనేయులు రూ. 2వేలు అందజేశారు. కార్యక్రమంలో రవూఫ్, వెంకటేశులు, రవి, రామాంజనేయులు, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల విగ్రహ ప్రతిష్టాపన

పెనుకొండ : పట్టణంలోని కాశీవిశ్వేశ్వరాలయంలో ఆదివారం నాగుల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర నారాయణ, పెనుకొండ ఎజిపి ఎం.అశ్వర్థరెడ్డి, స్థానిక వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. అలాగే టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారధి, నాయకులు కురుబ కృష్ణమూర్తి, సామకోటి ఆదినారాయణ, తదితరులు ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

మైనర్లు వాహనం నడిపితే తల్లిదండ్రులపై చర్యలు : ఎస్ఐ

లేపాక్షి : మండల పరిధిలో మైనర్లు వాహనం నడిపితే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మునీర్ అహ్మద్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక బస్టాండ్ ఆవరణలో మైనర్ పిల్లలు నడుపుతున్న పలు వాహనాలను ఆయన సీజ్ చేశారు. ట్రిబుల్ డ్రైవింగ్ వెళ్లడం ఆ ప్రయాణం అందరికీ ప్రమాదకరమని హెచ్చరించారు. చిన్నపిల్లలకు వాహనం ఇస్తే ఏవైనా ప్రమాదాలు చోటు చేసుకుంటే నష్టపోయిన కుటుంబాలకు ఎవరు దిక్కని పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి, పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

బస్టాండ్ ఆవరణలో మైనర్లను హెచ్చరిస్తున్న ఎస్ఐ

రాజీవ్‌గాంధీ హయాంలోనే పారిశ్రామికాభివృద్ధి

ప్రజాశక్తి-హిందూపురం

దివంగత ప్రధాని రాజీవ్ గాంధీతోనే దేశంలో పారిశ్రామికాభివృద్ధి జరిగిందని కాంగ్రెస్‌పార్టీ నాయకులు బాలాజీమనోహర్ పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి పురస్కరించుకొని ఆదివారం స్థానిక రహమత్‌పురం సర్కిల్‌లో ఉన్న రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు. చిన్న వయసులో దేశప్రధానిగా, ఐటి, టెలికాం రంగాలను పరుగులు పెట్టించిన ఘనత రాజీవ్‌కే దక్కుతుందన్నారు. చివరకు దేశం కోసం ప్రాణాన్ని సైతం అర్పించారని, నేటి యువత రాజీవ్‌గాంధీని ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధి కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అమానుల్లా, జమీల్, లీగల్ సెల్ అసీఫ్‌బాషా, నాగరాజు, మహ బూబ్‌బాషా, సమీయుల్లా, అక్రమ్, నద్రుల్లాఖాన్, ఫయాజ్, హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ ఆసీఫ్, గంగాధరప్ప, తిరుపాల్, గౌస్, అయాజ్, అజ్మతుల్లా, ఫకృద్దీన్, బాబు, గోపాల్, గాయత్రి, పాల్గొన్నారు.

పురంలో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కదిరి అర్బన్ : దివంగత ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఇందిరాగాంధీ కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త పిఎస్ అహ్మద్‌హుస్సేన్ హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగించిందన్నారు. నాయకులు మాట్లాడుతూ రాబోయే కాలంలో కేంద్రంలో రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని ధీమా వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందని, ఎపిలో కూడా కాంగ్రెస్‌పార్టీని బలోపే తం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు కదిరప్ప మునికుమార్, మహమ్మద్‌రఫీ, తిరుపాల్, ఇందాదుల్లా ఖాన్, కదిరప్ప అల్తాఫ్, శ్రీరాములు, ఆనంద్, ఉపేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

రాత్రివేళ వైద్యులు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

స్థానిక ప్రభుత్వాసుపత్రిలో 24/7 వైద్యులు అందుబాటులో ఉండాలని మండల ప్రజలు కోరుతున్నారు. స్థానిక ప్రభు త్వాసుపత్రిలో ప్రతి రోజూ వైద్యులు ఉదయం 10 గంటలకు విధులకు హాజరవడం సాయంత్రం 5 గంటలకి వెళ్లిపోతున్నా రు. రాత్రి వేళ వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. నంబులపూలకుంట సమీపంలోని సోలార్ పవర్ ప్రాజెక్టు వద్ద రాత్రివేల ఏదైనా ప్రమాదం జరిగినా, మండల వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు జరిగినా, గర్భిణులు ఆసుపత్రికి వచ్చినా అత్యవసర పరిస్థితిలో వైద్యం చేయాలంటే వైద్యులు అందుబాటులో ఉండాలి. కానీ ఇక్కడ రాత్రి వేళ ఓ నర్సు, ఓ అటెండర్ మాత్రమే ఉంటారు. వారు ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి వచ్చే వారికి వైద్యం చేయలేక కదిరి ఆసుపత్రికి వెళ్లాలని సూచిస్తున్నారు. దీంతో రాత్రివేళ అత్యవసర స్థితిలో మెరుగైన వైద్యం అందక ప్రజలు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. స్థానిక ఆసుపత్రిలో రాత్రివేళ వైద్యులు అందుబాటులో ఉండడం లేదని గత నెలలో జరిగిన సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకెళ్లిని ఫలితం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రిలో రాత్రివేళ డాక్టర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైసిపి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

సమావేశంలో మాట్లాడుతున్న 'చిలకం'

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సూచించారు. ఆయన ఆదివారం పట్టణంలోని తన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులను ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ప్రతివార్డు, గ్రామంలో తిరిగి ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ఓటు నమోదు చేయించేలా కృషి చేయాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరి ఓటు ఉందా లేదా అని పరిశీలించి ఒకవేళ వారి ఓటు తొలిగించి ఉంటే తిరిగి నమోదు చేయించాలన్నారు. ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాను ఉపయోగించుకునని జనసేన పార్టీ తరపున చేసే కార్యక్రమాలను, వైసిపి వైఫల్యాయలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటి సభ్యులు, మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మండల పరిధిలోని పాలసముద్రం జడ్పి హైస్కూల్ ఆవరణలో సర్పంచి చిన్నగంగప్ప ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం మార్క్ సూపర్ స్పెషాలిటీ గుండె ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబికంలో 210 మందికి మధుమేహం, బిపి, ఈసిజి, 2డి ఎకో, తదితర గుండె వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 40 మందికి శస్త్రచికిత్స చేయాలని, వారికి ఉచితంగా చేస్తామని నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో మార్క్ ఆసుపత్రి గుండె వైద్య నిపుణులు అమర్‌మహేష్, కార్డియాలజిస్ట్ హర్షద్, మేనేజర్లు డి.వినోద్‌కుమార్, వెంకటేష్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైద్యులను సర్పంచి ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు.

పేదలకు కంటి వైద్య సేవలందించడమే ధ్యేయం

ప్రజాశక్తి-కదిరి అర్బన్

కంటి అద్దాలను అందజేస్తున్న డాక్టర్ మదన్‌కుమార్

పేద ప్రజలకు వెలుగును ప్రసాదించడమే ధ్యేయంగా సేవలందిస్తానని చిన్న పిల్లల వైద్య నిపుణులు సివి మదనకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని టవర్ క్లాక్ సమీపంలో ఉన్న రాణి పేట స్కూల్‌లో ఆదివారం ఎపి మెడికల్ కౌన్సిల్ సభ్యులు, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మదన్‌కుమార్ ఆధ్వర్యం లో శాంతి రామ్ మెడికల్ కాలేజీ సహకారంతో లేజర్ కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అలాగే 50 మందికి రూ. 800 విలువ చేసే రెండు రకాల కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది సివి కృష్ణమూర్తి, ఇంజినీర్ కొమ్ము భాస్కర్, వెంకటేష్, పోతిరెడ్డి రాజేష్, శాంతిరాం మెడికల్ కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు. క్యాంపులో వంద మంది హాజరవగా 40 మందిని ఆపరేషన్ కోసం నంద్యాలకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

దోమల నివారణపై ర్యాలీ

దోమల నివారణపై ర్యాలీ చేపట్టిన వైద్య సిబ్బంది

ముదిగుబ్బ : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆదివారం పురవీధుల్లో దోమల నివారణపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేంద్ర, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నీటిలో పెరిగే దోమల వల్ల డెంగీ జ్వరం వ్యాపిస్తుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టుపక్కల పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, కుండలు లేకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. అలాగే దోమల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ర్యాలీలో భాగంగా 'దోమ పుట్టకూడదు–దోమ కుట్టకూడదు' అనే నినాదాన్ని జనంలోకి తీసుకెళ్లారు. ర్యాలీలో సిహెచ్ఒ సరస్వతమ్మ, ఎంపిహెచ్ఒలు, హెల్త్‌సూపర్‌వైజర్లు, వైఎస్ఆర్ క్లినిక్ సిహెచ్ఒలు, హెల్త్ అసిస్టెంట్స్, హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

హిందూపురం : మండల పరిధిలోని గోళాపురం గ్రామంలో ఆదివారం రామకృష్ణారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని నారాయణ గుండె, షుగర్ క్లినిక్ వైద్యులు నరసింహారెడ్డి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా గుండె జబ్బులు, బిపి, షుగర్, థైరాయిడ్‌తో పాటు ఇతర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా ఈసీజీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం వైద్యులు నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఓ గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరం ఉన్నా వారికి ఉచితంగా మందులు ఇస్తున్నామన్నారు. శిబిరంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మూర్ఛ వ్యాధిపై అపోహలు వీడండి

హిందూపురం : మూర్ఛ వ్యాధిపై అపోహాలు విడనాడాలని, క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధిని నియంత్రించవచ్చని డా. ఇటి రామ్మూర్తి తెలిపారు. మూర్ఛ వ్యాధిగ్రస్థుల కోసం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఆర్‌పిజిటి రోడ్డులోని ఆల్ హిలాల్ పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు డా. ఇటి రామ్మూర్తి 155 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, 2 నెలలకు సరిపడు మందులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మూర్ఛవ్యాధిగ్రస్థులు నీరు, నిప్పు, ఎత్తమయిన ప్రదేశాల్లో యంత్రాల వద్ద సంచరించరాదన్నారు. పెళ్లి, సంసారం, ఉద్యోగానికి పనికి రారనే అపోహాలు విడనాడాలన్నారు. శిబిరంలో వైద్యులు శ్రీనివాసులు, రామకృష్ణ, అతవుల్లా, నాగేంద్రాచారి, లక్ష్మిపతి, నాగరాజగుప్త, ఉగ్రప్ప, సుబ్రహ్మణ్యానాయక్, మంజునాథాచారి, చంద్రశేఖర్‌రెడ్డి, అబ్దుల్‌హక్ సేవలు అందించారు.

గ్రూప్-1లో మెరిసిన పేదింటి విద్యా కుసుమం

ప్రజాశక్తి-బుక్కపట్నం

శివకుమార్ నాయక్

మండల పరిధిలోని అడవి నార్సింపల్లితండాకు చెందిన నిరుపేద గిరిజనులైన చెన్నకేశవులునాయక్, నారాయణమ్మ బాయి దంపతుల మూడవ కుమారుడైన శివకుమార్‌నాయక్ గ్రూప్-1 సాధించి సత్తా చాటాడు. రెక్కాడితే కానీ డొక్కాడని స్థితిలో తన అన్న ఆటో తోలి శివకుమార్‌నాయక్‌ను చదివించాడు. శివకుమార్‌నాయక్ స్వగ్రామంలో ప్రాథమిక విద్యనభ్యసించి పదో తరగతి వరకు పెనుకొండ పాఠశాలలో చదివాడు. అంచెలంచెలుగా ఎదుగుతూ తల్లిదండ్రులకు అన్నకు బరువు కాకూడదనే దృఢ నిశ్చయంతో ఉన్నత విద్య వైపు దృష్టి సారించి డీ-ఫార్మసీ, ఎం-ఫార్మసీ పూర్తి చేసి రైల్వేలో ఉద్యోగం సంపాదించి కుటుంబాన్ని పోషించేవాడు. ఈ క్రమంలోనే సమీప బంధువులు, స్నేహితుల ప్రోత్సాహంతో ఎలాంటి శిక్షణ తీసుకోకుండానే గ్రూప్-1 సాధించి అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా ఎన్నికయ్యారు. దీంతో శివకుమార్‌నాయక్‌ను ఎంఇఒ గోపాల్‌నాయక్, గ్రామస్తులు అభినందించారు.

చెత్త సేకరణ వందశాతం అమలు చేయాలి

హిందూపురం : ఇంటింటి చెత్త సేకరణ 100 శాతం అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ సూచించారు. ప్రతి రోజూ ఉదయం కార్మికుల హాజరు సమయంలో శానిటేషన్ కార్యదర్శులు తప్పక హాజరు కావాలని ఆదేశించారు. కమిషనర్ ఆదివారం కార్మికుల హాజరు సమయంలో పర్యటించి తనిఖీ చేశారు. కార్యదర్శులు తప్పకుండా హాజరై కార్మికుల హాజరు తీసుకోవాలన్నారు. కార్మికులు విధుల్లో ఉన్న సమయంలో తప్పకుండా వారికి కేటాయించిన పరిధిలో ఉండాలన్నారు. టిప్పర్, ట్రాక్టర్ ద్వారా చెత్తను తరలించే లోడ్‌ల సంఖ్యను మెరుగు పరచాలన్నారు. పని విభజన చేసి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కార్మికులు హాజరు సమయంలో ఆలస్యంగా రాకుడదని కమిషనర్ సూచించారు.

రైతులకు వందశాతం బీమా పరిహారం ఇవ్వాలి

ముదిగుబ్బ : మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడి వేరుశన పంట నష్టపోతున్న రైతులకు ప్రభుత్వం వంద శాతం బీమా పరిహారం మంజూరు చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ముదిగుబ్బలో ఆదివారం ఆ పార్టీ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 70 శాతం మంది వ్యవసాయం మీద ఆధారపడి తద్వారా వేరుశనగ పంట జీవనాధారంగా చేసుకొని జీవిస్తున్నారని తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 3 నెలలవుతున్నా నేటికీ మండలంలో 30 శాతం వర్షపాతం కూడా నమోదు కాలేదన్నారు. ఈసారి అనావృష్టితో వేరుశనగ, కంది, తదితర వర్షాధార పంటలు ఎండిపోతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి తిప్పయ్య, సీనియర్ నాయకులు కృష్ణయ్య, శంకర తదితరులు పాల్గొన్నారు.

రైతు చిన్న గంగన్నను ప్రభుత్వం ఆదుకోవాలి

పెనుకొండ : తాడిమర్రి మండల పరిధిలోని మర్రిపేకలపల్లి గ్రామానికి చెందిన కురుబ చిన్నగంగన్న చీనీ చెట్లను నరికివేసి పైపులైన్లను ధ్వంసం చేయడం దుర్మార్గమని జిల్లా కురుబ సంఘం నాయకులు కురుబ కృష్ణమూర్తి, సామకోటి ఆదినారాయణ పేర్కొన్నారు. ఆదివారం చంద్రగిరి గ్రామంలో కృష్ణమూర్తి మీడియాతో మాట్లాడుతూ రైతు చిన్న గంగన్నకు తమవంతుగా, కురుబ సంఘం తరపున ఆర్థిక సాయం అందించడమే కాకుండా పార్టీ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కురుబలు ఐకమత్యంగా ఉండాలన్నారు. సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ ఇటీవల కాలంలో బిసిలపై దాడులు ఎక్కువవుతున్నాయన్నారు. రైతు చిన్న గంగన్న విషయాన్ని సోమవారం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు శ్రీరాములు, కాటమయ్య, ప్రసాద్, మల్లికార్జున, అశ్వర్థనారాయణ, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదాసు విగ్రహ ప్రతిష్టాపన

కనకదాసు విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న పార్థసారథి

పెనుకొండ : మండల పరిధిలోని దుద్దేబండ పంచాయతీ చంద్రగిరి గ్రామంలో ఆదివారం కురుబల ఆరాధ్య దైవం కనకదాసు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా ఎమ్మెల్యే శంకరనారాయణ, మాజీ ఎమ్మెల్యే బికె పార్థసారథి, టిడిపి నాయకులు కురుబ కృష్ణమూర్తి, సామకోటి ఆదినారాయణ, సవితమ్మ వేర్వేరుగా హాజరై కనకదాసు సేవలను కొనియాడారు. అనంతరం అతిథులను కురుబ సంఘం నాయకులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి గౌతమీ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపిపి గీతా రామ్మోహన్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు ప్రకాష్‌రెడ్డి, కొండల రాయుడు, కురుబ సంఘం ముఖ్య నాయకులు శ్రీరాములు, ప్రసాద్, అశ్వర్థనారాయణ, కాటమయ్య, స్థానిక కురుబ సంఘం నాయకులు ముత్యాలు, చంద్రశేఖర్, నాగరాజు, శీన, కప్పల నారాయణ, వెంకట్రాముడు, పెద్దన్న, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు వీరేశలింగంకు నివాళి



కందుకూరు వీరేశలింగం జయంతి సభలో మాట్లాడుతున్న వక్తలు

పెనుకొండ : ఆజాదీ కా అమృత్ మహోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని శ్రీశాంతినికేతన్ పాఠశాల ప్రాంగణంలో జన చైతన్య రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కందుకూరు వీరేశలింగం పంతులు జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు వీరేశలింగం పంతులు జీవిత చరిత్ర, సంఘ సంస్కరణలను స్మరించుకున్నారు. అనంతరం హెచ్‌ఎం అరుణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక స్పృహ కలిగి ఉండాలని సూచించారు. దేశంలో ఎందరో మహానుభావులు ఎన్నో సంస్కరణలు చేశారని వాటిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, మురళీకృష్ణ, సామాజిక కార్యకర్త సాయిప్రసాద్, సంస్థ అధ్యక్షుడు చంద్రమౌళి, రాఘవేంద్రరావు, సునీత, ఆశాలత, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతికి నాయకుల సంతాపం

మడకశిర : గుడిబండ మండల పరిధిలోని ఆచారిపాళ్యం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త కరియప్ప రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి మడకశిర ప్రభుత్వాసుపత్రి మార్చురీలో కరియప్ప మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. అలాగే అతడి కుటుంబ సభ్యులను ఓదార్చి టిడిపి అండగా ఉంటుందని భోరోసా కల్పించారు. ఆయన వెంట నాగరాజు, బూదిపల్లి జయరాం, నాయకులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యార్థిని ఆత్మహత్య

రొద్దం : సిఎంఎలో మార్కులు తక్కువ వచ్చాయని మనస్థాపానికి గురై మండల పరిధిలోని బొమ్మరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయరెడ్డి కుమార్తె భూమిక(19) ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె హైదరాబాద్‌లో సిఎంఎ చదువుతోంది. ఇటీవల ఫలితాలు వెలువడగా మార్కులు తక్కువ వచ్చాయని మూడు రోజుల క్రితం గ్రామానికి వచ్చింది. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పై కప్పునకు ఉరి వేసుకుంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ నాగస్వామి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అలాగే మృతదేహాన్ని పెనుగొండ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

యువతి బలవన్మరణం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన మహబూబ్‌పీరా రెండవ కుమార్తె నస్రీన్(19) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఉరివేసుకుని ఆత్మహ త్య చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మారుతీనగర్‌కు చెందిన మహబూబ్‌పీరా ఎలక్ట్రీషియన్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు. రెండవ కుమార్తె నస్రీన్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన నస్రీన్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. విషయం తెలుసుకున్న టూ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. అలాగే మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నస్రీన్‌కు వివాహం కాలేదు.

మల్లాపల్లిలో ఆవు చోరీ

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని మల్లాపల్లి గ్రామంలో సర్పంచి శివానందకు చెందిన రూ. 40 వేల విలువ చేసే ఆవు ఆదివారం వేకువజామున చోరీకి గురైంది. నందగోకుల ఆశ్రమంలోని షెడ్డులో ఆవును ఉంచామని, అయితే తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు శివానంద తెలిపారు. ఎవరికైనా ఆవు కనపడితే వెంటనే సమాచారం అందించాలని ఆయన కోరారు.

పేకాట జూదరులు అరెస్టు

మడకశిర రూరల్ : మండల పరిధిలోని మనూరు రంగాపురం గ్రామంలో పొలాల వద్ద ఆదివారం పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అలాగే వారి నుంచి రూ. 12,050 నగదు, 1 మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పేకాట జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు.

బత్తలపల్లి ఇన్‌ఛార్జి ఎస్ఐగా ప్రదీప్‌కుమార్

బత్తలపల్లి : ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు బత్తలపల్లి ఇన్‌ఛార్జి ఎస్ఐగా ప్రదీపకుమార్ ఈ నెల 17వ తేదీ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న టీవీ శ్రీహర్ష సిఐగా ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యరు. ప్రదీప్‌కుమార్ పోతుకుంట ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవా ణా, కర్నాటక మద్యం, నిషేధిత గుట్కాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలవాలన్నారు.

కొంకల్లు ఆంజనేయస్వామి హుండీ లెక్కింపు

గుడిబండ : మండల పరిధిలోని కొంకల్లు గ్రామ సమీపంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయ హుండీని ఆదివారం గ్రామస్తుల సమక్షంలో లెక్కించారు. మొత్తం రూ. 19,500 ఉండగా అందులో రూ. 850 పాతనోట్లు పోగా మిగిలిన నగదును గ్రామ పెద్దల సమక్షంలో లెక్కించినట్లు, ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధి కోసం ఖర్చు పెట్టనున్నట్లు కమిటీ అధ్యక్షులు రాజకుమార్ తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షులు ఎంపిడిఒ రామారావు, కమిటీ కార్యదర్శి, శివకుమార్, కోశాధికారి భోజరాజు, కమిటీ సభ్యులు మాలింగప్ప, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

31న పౌర్ణమి గరుడసేవ

ధర్మవరంటౌన్ : పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానంలో ఈ నెల 31వ తేదీ సాయంత్రం 6 గంటలకు పౌర్ణమి గరుడ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ దాశెట్టి సుబ్రమణ్యం, ఇఒ వెంకటేశులు తెలిపారు. పట్టణంలో ఆదివారం వారు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో దాతలు బోడగల నారాయణప్ప అండ్ సన్స్, బాలాజీ అండ్ బ్రదర్స్ సహకారంతో ఇక్కడ గరుడసేవ నిర్వహిస్తామని తెలిపారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

గోరంట్ల : స్థానిక జడ్పి హైస్కూల్‌లో 1976-77లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం మండల పరిధిలోని రాగిమేకలపల్లిలో కలిసి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు యోగ క్షేమాలను తెలుసుకుని ఆనందంగా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలాగే స్నేహితుల్లో ఒకరైన టంగుటూరి విజయేంద్రగుప్త ఆర్థిక ఇబ్బం దుల వల్ల కుమారుడిని చదివించలేకపోతుంటే స్నేహితులందరూ కలిసి రూ. 61వేలు అందజేశారు. అలాగే మండల అగ్రి ఛైర్మన్ రామకృష్ణారెడ్డి రూ. 10వేలు, వ్యాపారవేత్త ఎంవి నాగరాజు ఫ్యామిలీ రూ. 10వేలు విజయేంద్ర గుప్తాకు అందజేసి నట్లు తెలిపారు.

రజక సంఘం మండల అధ్యక్షునిగా రెడ్డిపల్లి హరికృష్ణ

ముదిగుబ్బ : స్థానిక అయ్యప్ప స్వామి గుడి ఆవరణలో ఆదివారం నిర్వహించిన రజకుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కమ్మన్న, జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం సమక్షంలో మండల అధ్యక్షునిగా రెడ్డిపల్లి హరికృష్ణ, కార్యదర్శిగా సంఘాల లింగార్జున ను నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర, మండల నాయకులు మాట్లాడుతూ రజకులకు ఎస్సీలుగా గుర్తించాలని, రక్షణ చట్టం కల్పించాలని, వత్తిలో ఉన్న 50 ఏళ్లు పైబడిన రజకులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని, 250 విద్యుత్ యూనిట్లు ఫ్రీగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారికి వెండివస్తువు వితరణ

కదిరి టౌన్ : అన్నమయ్య జిల్లాలోని మొలకలచెరువుకు చెందిన బొంతల రమేష్‌బాబు, శ్రీలక్ష్మి కుటుంబ సభ్యులు ఆదివారం ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామికి 2 కిలోల బరువు ఉన్న వెండి బిందెలు-2 సమర్పించారు. దీంతో ఆలయ కమిటీ ఛైర్మన్ జె.గోపాలక్రిష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించి దాతకు స్వామి వారి వస్త్రం, ఫొటో, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు

లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మడకశిర : మండల పరిధిలోని గోవిందాపురం పంచాయతీ సంకమ్మనపాళ్యం గ్రామంలో ఆదివారం నిర్వహించిన లక్ష్మీవెంకటే శ్వరస్వామి స్థిరబింబ ప్రతిష్టాపన కార్యక్రమంలో నీలకంఠాపురం దేవస్థానముల కమిటీ ఛైర్మన్, మాజీ మంత్రి రఘువీరా రెడ్డి పాల్గొన్నారు. సంకమ్మనపాళ్యం గ్రామంలో లక్ష్మీవేంకటేశ్వర స్వామిస్థిర బింబ ప్రతిష్థాపన, శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాల చరబింబ ప్రతిష్థాపన మహోత్సవంలో రఘువీరా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రక్తదానంలో మరొక ప్రాణాన్ని నిలబెట్టవచ్చని ఇండియన్ రెడ్ క్రాస్ ధర్మవరం శాఖ ఛైర్మన్ డాక్టర్ నరసింహులు, జిల్లా వైస్ ఛైర్మన్ పోలా ప్రభాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్జీవో హోం, ఇండియన్ రెడ్ క్రాస్, అఖిల భారత చిరంజీవి యువత సంఘం, రాష్ట్ర రామ్ చరణ్ యువశక్తి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ సత్య, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి హాజరై మాట్లాడారు. రక్తదాతల ద్వారా ఎంతోమందికి పునర్జన్మ కలుగుతోందన్నారు. అనంతరం 35 మంది రక్త దాతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అఖిల భారత చిరంజీవి యువత సంఘం పట్టణ అధ్యక్షుడు కడపల సుధాకర్‌రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు కోలా నాగార్జున, కన్నా వెంకటేష్, రఫీ, శివప్రసాద్, వినయ్, ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

NAME CHANGE

SADDAPALLI AKRAM i do hare by declare that my father name mentioned as SADDAPALLI HUSAIN SAB (old name) in my passport No . J3438876. Old name changed as SADDAPALLI REDDY HUSSAIN SAB (New name) as Aadhara No. 6698 6801 0378, present residing at D.No.10/1017/4A, Madanapalli road, Kadiri Post and Town, Sri Satya Sai District, A.P-51559.